క్లుప్తంగా

'కంటి వెలుగు'పై నేడు అవగాహన

మేళ్లచెరువు: ప్రభుత్వం చేపట్టబోయే కంటి వెలుగు కార్యక్రమంపై మంగళవారం మండల పరిషత్‌ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఇసాక్‌హుస్సేన్‌ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పద్మ సైదేశ్వరరావు అధ్యక్షతన జరగనున్న ఈ కార్యక్రమానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ, రెవెన్యూ, ఐకేపీ, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది సకాలంలో హాజరుకావాలని కోరారు.

కోదాడ పట్టణ ట్రాఫిక్‌ ఎస్‌ఐగా రాంబాబుగౌడ్‌



కోదాడ రూరల్‌: కోదాడ ట్రాఫిక్‌ ఎస్‌ఐగా సురభి రాంబాబుగౌడ్‌ సోమవారం విధుల్లో చేరారు. కోదాడ పట్టణ స్టేషన్‌లో పని చేస్తున్న ఆయన బదిలీపై ట్రాఫిక్‌ ఎస్‌ఐగా వెళ్లారు. ఇక్కడ ట్రాఫిక్‌ ఎస్‌ఐగా పనిచేసిన మగ్దూంఅలీ నల్లగొండ వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్‌ సమస్యను పరిష్కరిస్తానని అన్నారు.

ఓపెన్‌ స్కూల్‌లో ప్రవేశాలకు గడువు పెంపు

గరిడేపల్లి: 2022–23 విద్యా సంవత్సరానికి గాను తెలంగాణ ఓపెన్‌ స్కూల్‌ 10వ తరగతి, ఇంటర్‌ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రభుత్వం ఈ నెల 13వ తేదీ వరకు గడువు పొడిగించిందని గరిడేపల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. సత్యనారాయణరెడ్డి సోమవారం తెలిపారు. ఇంటర్‌ కేవలం ఒకే సంవత్సరంలో ఐదు పేపర్లుతో పూర్తి చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం సెల్‌ :9440524718, 6304949238 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పిచ్చిరెడ్డి ఫౌండేషన్‌ చేయూత

గరిడేపల్లి: మండలంలోని పొనుగోడు ఎస్సీ కాలనీలోని నిరుపేద కుటుంబాలకు సోమవారం జోగు పిచ్చిరెడ్డి ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్‌ కోశాధికారి జోగు అరవింద్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ నందిపాటి సైదులు, మత్స్యశాఖ మాజీ అధ్యక్షులు పకీరా, శాఖ కార్యదర్శి జానీ, జూలకంటి నరేష్‌, రఫీ, బాబులు, సైదులు తదితరులున్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

నేరేడుచర్ల: నేరేడుచర్లలోని వివిధ బ్యాంకుల యాజమాన్యం రైతులను ఇబ్బందులు పెట్టకుండా సకాలంలో రుణాలివ్వాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి రాపోలు నవీన్‌ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. రైతుబంధు ఖాతాల్లోకి డబ్బులు పడగానే బ్యాంకర్లు పెండింగ్‌ రుణాల పేరుతో ఖాతాలను సీజ్‌ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకు ఖాతాలపై ఉన్న ఫ్రీజింగ్‌ను ఎత్తివేయాలని డిమాండ్‌ చేశారు. లేని పక్షంలో బీఎస్పీ ఆధ్వర్యంలో అన్నీ బ్యాంకుల ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పేయింటర్స్‌ అసోసియేషన్‌ నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

మోతె: మండలంలోని నామవరం గ్రామంలో సోమవారం పేయింటర్స్‌ వర్కర్స్‌ అసోసియేషన్‌ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గండమళ్ల రాంబాబు (నామవరం), ఉపాధ్యక్షుడిగా గంట లక్ష్మణ్‌(విభళాపురం), ప్రధాన కార్యదర్శిగా వాస లక్ష్మయ్య(నామవరం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన తోటి పేయింటర్స్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో బాదె వంశీ, రాయి శ్రీనివాస్‌, గోపి ఉపేందర్‌, వాస వెంకటేష్‌, నిమ్మ మధు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి

గరిడేపల్లి: దేశ వ్యాప్తంగా 60శాతంకు పైగా ఉన్న బీసీలకు చట్టసభల్లో సరైన ప్రాధాన్యం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు రాంబాబు గౌడ్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకులు మారుతున్నా బీసీల బతుకులు మారడం లేదన్నారు. జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో సముచిత స్థానం కల్పించాలన్నారు. బీసీల సమస్యలపై అధ్యయనం చేసేందుకుచైతన్య యాత్రలు ప్రారంభిస్తామన్నారు.

పీఆర్సీ కమిటీని నియమించాలి

కోదాడ అర్బన్‌: తెలంగాణలో 2023 జూన్‌ 30తో మొదటి పీఆర్సీ గడువు పూర్తి కానున్నదని, జూలైలో 2వ పీఆర్సీ కమిటీని నియమించి దాని ప్రకారమే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వాలని టీపీటీఎఫ్‌ కోదాడ మండల అధ్యక్షుడు బడుగుల సైదులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగుల రెండో వేతన సవరణకు సమగ్ర అధ్యయనానికి ఏడాది ముందునుంచే కసరత్తు ప్రారంభించాలన్నారు. ఈ ఏడాదిలో ఎన్నికలు ఉండనున్న నేపథ్యంలో కమిటీని నియమించాలని లేకుండా ఉద్యోగులకు నష్టం జరగుతుందన్నారు.

అవసరం లేకున్నా అదనపు గదులు

- బేతవోలు జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఐదు గదులు మంజూరు
- మన ఊరు–మనబడి కింద రూ.కోటి నిధులు కేటాయింపు
- రెండేళ్ల క్రితం నిర్మించిన గదిని తొలగిస్తున్న సిబ్బంది



బేతవోలు జెడ్పీహెచ్‌ఎస్‌లో సాగుతున్న కూల్చివేత పనులు



నూతనంగా నిర్మించిన జెడ్పీహెచ్‌ఎస్‌ భవనం

చిలుకూరు: బేతవోలు జిల్లా పరిషత్‌ పాఠశాలలో అవసరం లేకున్నా అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. దీంతో రెండేళ్ల క్రితమే నిర్మించిన ఓ గదిని కూల్చేస్తున్నారు. అనంతరం కొత్త గదులు నిర్మించేందుకు సిద్ధమవుతున్నారు.

పాఠశాలలో గదుల ఇలా..

ఈ పాఠశాలలో రెండంతస్తుల భవనంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లిష్‌ మీడియం 5 తరగతులు, 6, 7 తెలుగు మీడియం తరగుతుల తోపాటు స్టాఫ్‌ రూం, ప్రిన్సిపాల్‌ రూమ్‌కు కలిపి మొత్తం 10 గదులు ఉన్నాయి. ఇవికాక సైన్స్‌ ల్యాబ్‌కు వంట చేసేందుకు, ఇతర అవసరాలకు పాత భవనంలో ఐదు గదులు ఉన్నాయి. దీంతో ఇక్కడ ఎలాంటి ఇబ్బందులు లేవు.

అనాలోచిత నిర్ణయాలతో..

ప్రభుత్వ అధికారుల అనాలోచిత నిర్ణయాల వల్ల అవసరం లేకపోయిన ఈ పాఠశాలకు మన ఊరు–మన బడి కింద కోటి రూపాయలు మంజూరు చేశారు. ఈ నిధులతో పాఠశాల రెండో అంతస్తుపై మరో అయిదు గదులు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితమే నిర్మించిన భవనంపై మెట్ల వద్ద ఏర్పాటు చేసిన గదిని సోమవారం కూల్చివేత పనులు మొదలు పెట్టారు. అయితే మొదటి అంతస్తులోనే భవనంపైన తరగతులకు పోవాలంటేనే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు రెండో అంతస్తులో ఏర్పాటు చేయడం దేనికని ఉపాధ్యాయులే అంటున్నారు.

తెలుగు సంస్కృతికి ప్రతీక.. ముగ్గులు

- కోదాడ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్‌



ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌

కోదాడ అర్బన్‌: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ముగ్గుల పోటీలు ప్రతీకలని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌ అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని 14వ వార్డులో కౌన్సిలర్‌ కె.చందర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ మహిళల పండుగ అని, ఇంటి ముందు ముగ్గు వేయడంతో ఇంట్లోకి లక్ష్మి వస్తుందన్నారు. ముగ్గుల పోటీలతో మహిళల్లోని సృజనాత్మకత వెలుగులోకి వస్తుందన్నారు. ప్రథమ బహుమతిని పి.శిల్ప, ద్వితీయ బహుమతి త్రివేణి, తృతీయ బహుమతి లక్ష్మీ, చతుర్ధ బహుమతి నాగలక్ష్మీలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, వార్డు ప్రముఖులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్‌ నూతన కార్యవర్గం

హుజూర్‌నగర్‌: హుజూర్‌నగర్‌ వాసవి క్లబ్‌ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆసంఘ నాయకులు సోమవారం తెలిపారు. అధ్యక్షుడిగా ఎ.రవి, కార్యదర్శిగా వి.రామకృష్ణ, కోశాధికారిగా స్వామి గోపిలతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

గోదాదేవికి ఒడి బియ్యం సమర్పణ



హుజూర్‌నగర్‌ : ఒడి బియ్యం తెస్తున్న భక్తులు



ఒడి బియ్యం సమర్పిస్తున్న మహిళలు

హుజూర్‌నగర్‌ : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి అమ్మవారికి ఒడి బియ్యం సమర్పణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భగా దోసపాటి నరసింహ మూర్తి, శోభారాణి ఇంటి వద్ద నుంచి కుటుంబ సభ్యులు ఒడి బియ్యాన్ని మేళతాళాలతో, అన్నమయ్య భజన మండలి వారి కీర్తనలతో దేవాలయానికి తీసుకొచ్చారు. అనంతరం గోదా అమ్మవారిని మండపంలో భద్రపీఠంపై అధిష్ఠింపజేసి షోడష ఉపచారాలు ప్రత్యేక పూజలు, కుంకుక అర్చన జరిపించారు. పట్టు వస్త్రాలు, పూలు, తులసిమాలతో అమ్మ వారిని అలంకరించి తొమ్మిది రకాల పండ్లు, మిఠాయిలు, పూలదండలు, ఒడి బియ్యంతో ఆలయం చుట్టూ మేళతాళాలతో ముమ్మారు ప్రదక్షిణ గావించి ఒడి నింపారు. పూజ చేయించిన దంపతులను శేషవస్త్రంతో సన్మానించారు. కార్యక్రమంలో దేవాలయ అధికారి, అర్చకులు, స్నానాచార్యులు, ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస ఉత్సవాలు



అమ్మవారి పల్లకిసేవలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌ రూరల్‌: మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీ ఆదివరహలక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి దేవాలయంలో ధనుర్మాస మార్గాలి ఉత్సవాలను పురస్కరించుకొని 25వ రోజు సోమవారం పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర శతమావళి, సేవాకాలం, అలంకరణ, మంగళశాసనం, ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి పలకిసేవ తరదిర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎంపీ లక్ష్మణరావు, వికాస తరంగిణి అధ్యక్షురాలు కొత్త కళావతి, మాజీ ధర్మకర్తలు యరగాని రామస్వామి, రాగం లింగయ్య, కిరణ్‌గౌడ్‌, కనకయ్య, గురుస్వామి, గోపాల్‌, లింగయ్య, మల్లయ్య, అర్చకులు హరిష్‌కుమార్‌ చార్యులు, భక్తులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం నూతన కమిటీ ఎన్నిక

హుజూర్‌నగర్‌: హుజూర్‌నగర్‌లోని గోవిందాపురంలో గల శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం మున్నూరుకాపు సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కోల నాగేశ్వరరావు, గౌరవ సలహాదారులుగా డి.రామమూర్తి, ఆర్‌.వెంకయ్య, అధ్యక్షుడిగా దేవిశెట్టి వేణు, ప్రధాన కార్యదర్శిగా రాయల వెంకటేశ్వర్లు, వర్కింగ్‌ ప్రెసిడెంట్లుగా ఎస్‌.గోపి, బి.శ్రీనివాసు, పి.వెంకట నరసింహారావు, ఎం.రాజ్‌ కుమార్‌, కోశాధికారిగా చుక్క హరీష్‌లతో పాటు ఉపాధ్యక్షులు, కార్యదర్శిలుగా మరికొంత మందిని ఎన్నుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

నడిగూడెం : సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఇటీవల మంత్రి జగదీశ్‌రెడ్డి చేతుల మీదుగా జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు పొందిన మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయురాలు ఎస్‌.రజినిని సోమవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రిన్సిపాల్‌ సీహెచ్‌.ధనవిజయలక్ష్మి, పేరెంట్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు దాసరి శ్రీను, వైస్‌ప్రిన్స్‌పాల్‌ ఎ.రవికృష్ణ, ఉపాధ్యాయులు రేణుక, ఎ.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల నేతల ముందస్తు అరెస్ట్‌



మునగాలలో అరెస్ట్‌ అయిన నాయకులు



గరిడేపల్లి పోలీస్‌ స్టేషన్‌లో..

మునగాల: కానిస్టేబుల్‌, ఎస్‌ఐ నియామకాలను పాత పద్ధతిలో నిర్వహించాలని సోమవారం చేపట్టిన చలో ప్రగతిభవన్‌ ముట్టడి కార్యక్రమానికి తరలి వెళుతున్నారన్న సమాచారంతో ఏఐఎస్‌ఎఫ్‌, ఏఐవైఎఫ్‌, ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ నాయకులను సోమవారం తెల్లవారుజామున మునగాల పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్ట్‌ చేశారు. అరెస్టయిన వారిలో ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా మాజీ కార్యదర్శి సీహెచ్‌.సీతారామ్‌, ఏఐఎస్‌ఎఫ్‌ మండల అధ్యక్ష, కార్యదర్శులు విజయకుమార్‌, తాళ్లూరి త్రినాథ్‌, జిల్లా కమిటీ సభ్యులు ఎస్‌.మల్సూర్‌, డీవైఎఫ్‌ఐ మండల కార్యదర్శి గడ్డం వినోద్‌లు ఉన్నారు. ఆ తర్వాత సొంతపూచీకత్తుపై విడుదల చేశారు.

నడిగూడెం : ప్రగతి భవన్‌ ముట్టడికి తరలివెళ్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులను సోమవారం నడిగూడెం పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టు అయిన వారిలో డీవైఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్‌ కాసాని కిషోర్‌, బొడ్డు వెంకటనారాయణ, నోసిన అంజయ్య, కాసాని రాంబాబు, కంభంపాటి నవీన్‌ తదితరులు ఉన్నారు.

గరిడేపల్లి: ప్రగతి భవన్‌ ముట్టడికి వెళ్తున్న డీవైఎఫ్‌ఐ, ఏఐవైఎఫ్‌ కార్యకర్తలు, నాయకులను గరిడేపల్లి పోలీసులు సోమవారం ముందస్తుగా అరెస్ట్‌ చేసి పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్‌ అయిన వారిలో సీపీఎం, సీపీఐ మండల కార్యదర్శులు యాకుబ్‌, పోకల వెంకటేశ్వర్లు, హుస్సేన్‌, సైదులు, ఈద మధు, హలీమ్‌, నవీన్‌, కరుణాకర్‌, పెంటయ్య, బాష, రవి, శ్రీను, మహేష్‌, వీరయ్య, పుల్లారావు తదితరులున్నారు.

చిలుకూరు: ప్రగతి భవన్‌ ముట్టడికి వెళ్లకుండా స్థానికంగా ఉన్న ఏఐవైఎఫ్‌ నాయకులను పోలీసులు సోమవారం ముందుస్తుగా అరెస్ట్‌ చేసి చిలుకూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు, మండల అధ్యక్ష, కార్యదర్శులు అనంతుల రాము, కందుల మధు, మండల కోశాధికారి మాధవరపు రమేష్‌ తదితరులు ఉన్నారు.

హమాలీలకు కూలి రేట్లు పెంచాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

హుజూర్‌నగర్‌: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీల కూలిరేట్లు పెంచాలని హమాలీ వర్కర్స్‌ యూనియన్‌ (ఐఎఫ్‌టీయూ) గౌరవ అధ్యక్షుడు మేకల నాగేశ్వరరావు కోరారు. గతంలో కుదుర్చుకున్న ఒప్పదం గడువు ముగిసినందున నూతన ఒప్పదం చేసుకోవాలని కోరుతూ సోమవారం హుజూర్‌నగర్‌లో రైస్‌మిల్లర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు పొలిశెట్టి నరసింహారావు, గౌరవాధ్యక్షుడు గజ్జి ప్రభాకర్‌కు వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆయన చెప్పారు. ఒప్పంద గడువు ముగిసి 40 రోజులు కావస్తున్నందున వెంటనే హమాలీ సంఘంతో చర్చించి వారికి కూలిరేట్లు పెంచాలన్నారు. కార్యక్రమంలో హమాలీ వర్కర్స్‌ యూనియన్‌అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి గురవయ్య, కాకి అజయ్‌, నాయకులు పెద్ద నాగేశ్వరరావు, వీరయ్య, చిన్న నాగేశ్వరరావు, ప్రభాకర్‌, కేశవ, పటేల్‌, రాజు, ముఖేష్‌, వినోద్‌, గణేష్‌, లాలు మోహన్‌, ప్రదీప్‌, రాజేందర్‌, బజరంగీ, జితేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కులు సాధించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న గురవయ్య

హుజూర్‌నగర్‌: సమరశీల పోరాటాలతోనే హక్కులు సాధించుకోవాలని ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లకొండ గురవయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని రైస్‌ మిల్లుల డ్రైవర్ల సమావేశంలో మాట్లాడారు. మిల్లర్లు డ్రైవర్ల వేతనాలు పెంచాలని ఇప్పటికే రెండుసార్లు నోటీస్‌ ఇచ్చామన్నారు. అయినా యాజమాన్యాలు స్పందించకపోవడం తగదన్నారు. త్వరలో వారికి 3వ నోటీస్‌ ఇస్తామని దానికీ స్పందించకుంటే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తమని చెప్పారు. సమావేశంలో యూనియన్‌ అధ్యక్షుడు సలిగంటి జానయ్య, చింతకాయ రాము, ఎం.వీరబాబు, చల్లా శ్రీను, శీలం రాజు, శాసనాల శ్రీనివాస్‌, జి.నాగరాజు, సుబ్బరాజు, జానిబాష, నరేష్‌, జనార్దన్‌, ప్రసాద్‌, శ్రీను, రాంబాబు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

మునగాల: మండలంలోని ముకుందాపురం శివారులో ఉన్న ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో సోమవారం బీఆర్‌ఎస్‌ పార్టీ కోదాడ పట్టణ యూత్‌ ఉపాధ్యక్షుడు తమలపాకుల లక్ష్మీనారాయణ తన పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నారు. ఈసందర్భంగా కేక్‌కట్‌చేసి ఆశ్రమంలో అనాథలు, మానసిక వికలాంగులకు పండ్లు, బ్రెడ్‌ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం కోదాడ పట్టణ ఆర్గనైజింగ్‌ కార్యదర్శి బత్తుల ఉపేందర్‌, పట్టణ ఎస్సీ సెల్‌ ప్రధాన కార్యదర్శి సోంపంగు నాగరాజు, సుంకర అభిధర్‌ నాయుడు, బీఆర్‌ఎస్వీ పట్టణ అధ్యక్షుడు బొర్రా వంశీనాని, విద్యార్థి విభాగం నాయకులు సత్యం, తరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలి



క్యాలెండర్‌ ఆవిష్కరిస్తున్న టీపీయూఎస్‌ నాయకులు

మోతె: ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు వెంటనే చేపట్టాలని టీపీయూఎస్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెల్లంకొండ రామ్మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. సోమవారం మండలంలో నామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీపీయూఎస్‌ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయులకు ఉద్యోగులకు ఇవ్వాల్సిన మూడు డీఏలను అందించాలన్నారు. ప్రతి పాఠశాలలో స్కావెంజర్‌ను నియమించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బైరు తిర్మలేష్‌, మండల అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శులు సురభి శ్రీధర్‌, మిర్యాల శంకర్‌, కూడలి యూపీఎస్‌ హెచ్‌ఎం సత్యనారాయణ, గుజ్జ జయప్రకాష్‌, బానోతు సుధీర్‌, చిమట రాజేశ్వరి, పాతిమ, కె.రాహెల్‌కుమారి, కట్ట కృష్ణయ్య, ఒగ్గు జనార్దన్‌, డేవిడ్‌, రామ్మూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేత



సామగ్రిని అందజేస్తున్న ఎస్‌ఐ పగిళ్ల రవి

హుజూర్‌నగర్‌ రూరల్‌: విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగంలో రాణించాలని నల్లగొండ జిల్లా గట్టుప్పల ఎస్‌ఐ పగిళ్ల రవి అన్నారు. సోమవారం మండలంలోని లింగగిరి జిల్లా పరిషత్‌ పాఠశాలలో విద్యార్థులకు తన అక్క కొలుకులపల్లి లక్ష్మీ జ్ఞాపకార్థం రూ.5 వేల విలువ గల బాల్‌ బ్యాడ్మింటన్‌ క్రీడా సామగ్రిని పీఈటీ కదిర వెంకటరెడ్డితో కలిసి పంపిణీ చేసి మాట్లాడారు. అనంతరం ఇదే పాఠశాలలో చదువుకొని ఉన్నత ఉద్యోగం సాధించిన ఎస్‌ఐ రవిని పీఈటీ, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బడిబయట విద్యార్థుల వివరాల సేకరణ

నడిగూడెం : మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో బడిబయట విద్యార్థుల వివరాల సేకరణకు చేపట్టిన సర్వే సోమవారం కొనసాగింది. ఈ సందర్భంగా సీఆర్పీలు ఇంటింటికి వెళ్లి బడి బయట ఉన్న విద్యార్థుల వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో బృందావనపురం గ్రామ సర్పంచ్‌ బెల్లంకొండ హనుమయ్య, సీఆర్పీలు బందారపు గోవర్ధన్‌, రాజుల గురుస్వామి, నందిగామ రామారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి



మాట్లాడుతున్న పీఏసీఎస్‌ చైర్మన్‌ ఆవుల రామారావు

కోదాడ అర్బన్‌: పీఏసీఎస్‌ ఉద్యోగులు బాధ్యతగా పనిచేసి సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని కోదాడ పీఏసీఎస్‌ చైర్మన్‌ ఆవుల రామారావు అన్నారు. సోమవారం కోదాడ పీఏసీఎస్‌లో ఉద్యోగలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఏసీఎస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం హెచ్‌ఆర్‌ పాలసీ ద్వారా ఉద్యోగ భద్రత కల్పించడం హర్షణీయమన్నారు. ఎస్‌ఏ, ఎల్‌టీ రుణాల రికవరీలో నూటికి నూరు శాతం లక్ష్యం చేరుకోవాలన్నారు. ఉద్యోగుల సహకారంతో గతంలో రూ.10కోట్ల టర్నోవర్‌ ఉన్న సంఘం నేడు రూ.24 కోట్ల టర్నోవర్‌కు చేరందన్నారు. రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో సీఈఓ మంద వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాలధారులకు అన్నదానం

కోదాడ రూరల్‌: పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్‌ రోడ్డులో గల గాలి రమేష్‌ నాయుడు అయ్యప్ప సన్నిధానంలో మాలధారులకు సోమవారం దాతలు మునగాల మండల వైఎస్సాటీపీ అధ్యక్షుడు కేతిరెడ్డి మోహన్‌రెడ్డి, వైష్ణవి స్కూల్‌చైర్మన్‌ కాటంనేని లక్ష్మణ్‌, డాక్టర్‌ యశ్వంత్‌, డాక్టర్‌ ప్రశాంతిచౌదరి అన్నదానం ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా 500 మంది మాలధారులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాసునాయుడు, బర్మవత్‌ సీతరాం సింగ్‌, గడ్డం సూర్యారెడ్డి, పట్టా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్‌ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ జ్యోతి, మున్సిపల్‌ చైర్మన్‌ జయబాబు, సంఘం సభ్యులు

నేరేడుచర్ల: నేరేడుచర్ల జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో సోమవారం పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీపీ లకుమళ్ల జ్యోతి, జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, మున్సిపల్‌ చైర్మన్‌ చందమళ్ల జయబాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ చత్రునాయక్‌, జీహెచ్‌ఎం ఎల్‌.శ్రీనివాస్‌రావు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దీప్లానాయక్‌, సుధాకర్‌, శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్‌, వెంకన్న, శ్రీనివాస్‌, రవి, విజయ, మాధవి, సత్యనారయాణరెడ్డి, పుల్లయ్య, కొండయ్య, వీరారెడ్డి, కళ్యాణి, శ్రవంతి, కల్పన, భవాని, స్వాతి, సరస్వతి తదితరులున్నారు.

వెండి కిరీటం బహూకరణ



వెండి కిరీటం అందజేస్తున్న సర్పంచ్‌ పద్మ

నడిగూడెం : మండలంలోని రత్నవరం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో దుర్గామాత అమ్మవారికి ఆ గ్రామ సర్పంచ్‌ పగడాల పద్మ కుమార్తె సామల ఉమ శ్రీనివాసరెడ్డి దంపతులు రూ.37,100 విలువైన వెండి కిరీటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ పగడాల పద్మ, ఆలయ పూజారి శివయ్య, గ్రామ పెద్దలు పసుపులేటి వినయ్‌వర్దన్‌ తదితరులు పాల్గొన్నారు.

ఫాతిమా షేక్‌కు ఘననివాళి

కోదాడఅర్బన్‌ : సావిత్రిబాయి పూలేతో కలిసి పనిచేసిన చదువుల తల్లి ఫాతిమా షేక్‌ జయంతిని సోమవారం కోదాడలోని బాలాజీనగర్‌ హైస్కూల్‌లో టీఎస్‌ మీసా ఆధ్వర్యంలో నిర్వహించారు. మీసా డివిజన్‌ అధ్యక్షుడు ఖాజామియా పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళుర్పించారు. కార్యక్రమంలో రామనర్సయ్య, సోషల్‌ ఆక్టివిస్ట్‌ ఫోరం కన్వీనర్‌ షేక్‌ మునీర్‌, స్వామినాయక్‌, శ్రీనివాసరెడ్డి, గౌసుద్దీన్‌, భాగ్యమ్మ, జనార్దన్‌రెడ్డి, సత్తార్‌, రంగారెడ్డి, లచ్చునాయక్‌, నర్సింహారావు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

పచ్చని చెట్లు బుగ్గిపాలు

- మోతె మండలంలో విచ్చలవిడిగా బొగ్గు బట్టీల నిర్వహణ
- వివిధ గ్రామాల నుంచి పట్టణాలకు తరలుతున్న కలప
- అక్రమ వ్యాపారాలను అడ్డుకోని యంత్రాంగం
- అధికారుల అండతోనే సాగుతుందంటున్న ప్రజలు



మోతె పరిధిలోని బొగ్గు బట్టీలో పేర్చిన మొద్దులు

మోతె: మండలంలో బొగ్గు బట్టీల నిర్వహణ, కలప అక్రమ రవాణా విచ్చలవిడిగా కొనసాగుతోంది. ఒక పక్క మండల స్థాయిలో అధికారులతోపాటు కాలుష్య నియంత్రణ శాఖ నుంచి అనుమతి పొంది బట్టీలను పెట్టుకోవాల్సి ఉన్నా నిర్వాహకులు మాత్రం అవేమీ పట్టించుకోవడం లేదు. ఏ శాఖ నుంచి కూడా అనుమతి తీసుకోకుండానే ఇష్టారాజ్యంగా బొగ్గు బట్టీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పచ్చని చెట్లను సైతం నరికి కలప అక్రమంగా రవాణా చేస్తూ బొగ్గు బట్టీల వద్దకు చేరుస్తున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. దీంతో బొగ్గు బట్టీల నిర్వహణ, కలప రవాణా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.

కాల్వ కట్ట, రోడ్డు వెంట చెట్లను నరికి..

మండల పరిధిలో బోడబండ్లగూడెం ఎస్సీ కాలనీ రోడ్డు వెంట, బుర్కచర్ల, రాయిపహాడ్‌ గ్రామాల్లో కొన్నేళ్ల నుంచి బొగ్గు బట్టీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వ్యాపారులు మండల పరిధిలోని ఎస్సారెస్పీ కాల్వల వెంట, రోడ్ల వెంట ఉన్న చెట్లు నరికి బట్టీల వద్దకు తరలిస్తున్నారు. అనంతరం ఆ కలపను బొగ్గుగా మార్చి యథేచ్ఛగా వ్యాపారం చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్న అటవీశాఖ రేంజర్‌ స్థాయి అధికారులు, సెక్షన్‌ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఎస్సీ కాలనీలో బొగ్గు బట్టీ ఉండడంతో గ్రామస్తులతోపాటు పక్కనే ఉన్న కేజీబీవీ విద్యార్థినులు సైతం పొగ, దుమ్మధూళి వల్ల అనారోగ్యం బారిన పడే ప్రమాదం పొంచి ఉందని ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు.

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా..

మండలంలో రాంపురంతండాతో పాటు పలు గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు నిత్యం కలప అక్రమ రవాణా చేస్తూ వ్యాపారంగా మార్చుకున్నారు. మండలంలో ఏ ఊరులో చూసిన కలప వ్యాపారులు జోరుగా కలపను కొంటున్నారు. వీరు ఎస్సారెస్పీ కాల్వల వెంట ఉన్న వేప, చింత, కానుగ, సర్కారు తుమ్మలు వంటి చెట్లను సైతం వదలకుండా నరికి లారీల్లో, ట్రాక్టర్లలో లోడ్‌ చేసి పట్టణాలకు, హోటళ్లకు విక్రయిస్తు రూ.లక్షలు సంపాదిస్తున్నారు. ఈ వ్యవహారమంతా అధికారుల కనుసన్నల్లోనే నడుస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

మండలంలో బోడబండ్లగూడెం గ్రామంలో బొగ్గుబట్టీ నిర్వాహకులకు బర్నింగ్‌ లైసెన్స్‌ ఉంది. బర్నింగ్‌ లైసెన్స్‌లో ఉన్న నిబంధనలు ఉల్లంఘిస్తేస్తె వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మండలం నుంచి కలపను అక్రమంగా తరలించే వ్యాపారులపై నిఘా పెంచుతాం.

– రాజు, అటవీశాఖ సెక్షన్‌ ఆఫీసర్‌